వైభవంగా జగన్నాథ రథయాత్ర

రథయాత్రలో పాల్గొన్న భక్తులు

కమాన్‌చౌరస్తా, జూలై 15 : జిల్లా కేంద్రంలోని ఇస్కాన్ మందిరం, జగన్నాథ రథయాత్ర కమిటీ, ప్రజ్ఞాభారతి సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన బలభద్ర సమేత జగన్నాథ రథయాత్ర వైభవంగా సాగింది. ఇందులో భాగంగా, రాంనగర్ రమాసత్యనారాయణస్వామి ఆలయం వద్ద మంత్రి పొన్నం ప్రభాకర్, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, నాయకులు పూజలు చేసి, పూరీ యాత్ర తరహాలో రథం ముందు శుభ్రం చేశారు. గీతా భక్త సమాజం అధ్యక్షుడు బండ సత్తయ్య ఆధ్వర్యంలో ఉప్పల రామేశం, చిట్టుమల్ల దామోదర్, చిన్న వెంకటయ్య, సభ్యులు సంపూర్ణ భగవద్గీత పారాయణం చేశారు. కార్యక్రమంలో మయూరగిరి పీఠాధిపతి నమిలకొండ రమణాచార్య స్వామి పాల్గొన్నారు. ఇందులో భాగంగా, వివిధ వేషధారణలు, భజనలు, కోలాటాలు, నృత్యాలు, ఒగ్గుడోలు వంటి సాంస్కృతిక ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ ప్రపుల్ దేశాయ్, ఆర్డీవో కుందారపు మహేశ్వర్, యాత్ర చైర్మన్ కన్న కృష్ణ, కో చైర్మన్లు తుమ్మల రమేశ్ రెడ్డి, కోమాళ్ల రాజేందర్ రెడ్డి, కొమురవెల్లి వెంకటేశం, డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి, ప్రజ్ఞాభారతి ప్రతినిధి డాక్టర్ ఎల్ రాజభాస్కరరెడ్డి, మండల నగేశ రెడ్డి, నంది శ్రీనివాస్, గసికంటి జనార్దన్‌రెడ్డి, పారమిత విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఇనుగంటి ప్రసాదరావు, సిద్ధార్థ విద్యాసంస్థల అకాడమిక్ డైరెక్టర్ దాసరి శ్రీపాల్ రెడ్డి, గర్రెపల్లి మహేశ్వరశర్మ తదితరులతో పాటు పలు స్వచ్ఛంద, ఆధ్యాత్మిక, ధార్మిక, సేవా సంస్థల బాధ్యులు, కార్యకర్తలు, వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. చివరలో వైశ్యభవన్‌లో కరీంనగర్ ఇస్కాన్ ప్రతినిధి నరహరి ప్రభుదాస్ ప్రసంగం చేశారు. అనంతరం మూర్తులకు పూజలు చేసి, మహాప్రసాదాన్ని నివేదన చేసి భక్తులకు పంపిణీ చేశారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి

హుజూరాబాద్ రూరల్, జూలై 15: పెద్దపాపయ్యపల్లి గ్రామ మాజీ ఎంపీటీసీ వైద్యుల శిరీష మామయ్య రాజిరెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, సోమవారం బాధిత కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఆయన వెంట టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గెల్లు శ్రీనివాస్, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, నాయకులు సురేందర్‌రెడ్డి, ఐలన్న ఉన్నారు.

గురుకుల పాఠశాలను సందర్శించిన ఎమ్మెల్యే కవ్వంపల్లి

గన్నేరువరం, జూలై 15: గుండ్లపల్లి గ్రామంలోని మహాత్మా జ్యోతిభాపూలే బీసీ వెల్ఫేర్ బాలికల రెసిడెన్షియల్ పాఠశాలను ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ సోమవారం ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాలలో సరైన సదుపాయాలు లేవని విద్యార్థినుల తల్లిదండ్రుల నుంచి ఫిర్యాదులు అందడంతో పాఠశాలను సందర్శించి, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల ఆవరణ వర్షపు నీరు నిలిచి అపరిశుభ్రంగా ఉండడంతో ఎమ్మెల్యే అసహనం వ్యక్తం చేశారు. అక్కడి నుంచే బీసీ వెల్ఫేర్ శాఖ ఉన్నతాధికారులకు ఫోన్ చేసి సమస్యలు తెలిపారు. వాటిని పరిష్కరించాలని కోరారు.

ప్రభుత్వ భూములు కాపాడాలి: సుడా చైర్మన్

కార్పొరేషన్, జూలై 15 : సుడా పరిధిలో ఉన్న ప్రభుత్వ భూమిని కాపాడాలని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి ఆదేశించారు. సుడా కార్యాలయంలో సోమవారం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సుడా పరిధిలోని ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలని, అక్రమ లేఅవుట్‌ల విషయంలో ఉదాసీనత వద్దన్నారు. సుడాకు రెవెన్యూ పెంచాలని, ఎల్ఆర్ఎస్ అప్లికేషన్లు పరిశీలించాలని అధికారులకు సూచించారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్ ప్రపుల్ దేశాయ్, సుడా అధికారి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ప్రజావాణికి 15ఫిర్యాదులు

ముకరంపుర, జూలై 15: కరీంనగర్ సర్కిల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విద్యుత్ ప్రజావాణికి 15ఫిర్యాదులు వచ్చినట్లు ఎస్ఈ వడ్లకొండ గంగాధర్ తెలిపారు. సర్కిల్ కార్యాలయానికి ఎనిమిది దరఖాస్తులు రాగా, అందులో మూడింటిని తక్షణమే పరిష్కరించామని తెలిపారు. టౌన్ డివిజన్‌కు మూడు, కరీంనగర్ రూరల్ డివిజన్‌కు నాలుగు ఫిర్యాదులు వచ్చాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏడీఈ స్వప్న, ఏఈ సురేశ్ కుమార్, ఎస్ఏవో రాజేశం, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక క్వారీపై చర్యలు తీసుకోవాలని వినతి

తిమ్మాపూర్ రూరల్, జూలై 15 : రేణికుంట ఇసుక క్వారీపై చర్యలు తీసుకోవాలని సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు, మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ కనకయ్యకు గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ, ఇసుక క్వారీ పర్మిషన్ అయిపోయినా అక్రమంగా రాత్రి ఇసుకతోపాటు తమ పొలాల కింద మొరం తీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ శ్రీనివాస్, కొర్రి వంశీ, జూపాక వెంకటేశ్, తమ్మనవేని శ్రీనివాస్ యాదవ్, పండుగ సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

యూనివర్సిటీలోని సమస్యలు పరిష్కరించాలి

కార్పొరేషన్, జూలై 15 : శాతవాహన యూనివర్సిటీలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని ఏబీవీపీ స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్ అంజన్న జెల్లపెల్లి కోరారు. సోమవారం ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం విశ్వవిద్యాలయంలో బీఈడీ, లా కళాశాల నిర్మించాలని కోరారు. పీహెచ్‌డీ నోటిఫికేషన్ విడుదల చేయాలన్నారు. నూతన హాస్టల్ భవనాన్ని నిర్మించి, పీహెచ్‌డీ విద్యార్థులకు వసతి కల్పించాలని కోరారు.

గన్నేరువరం నాయబ్ తహసీల్దార్‌గా నరసింహాచారి

గన్నేరువరం, జూలై 15: మండల నాయబ్ తహసీల్దార్‌గా పి.నర్సింహాచారి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. పలువురు అధికారులు స్వాగతం పలికి సన్మానించారు. తహసీల్దార్ భిక్షపతి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా పీరీల ఊరేగింపు

కరీంనగర్‌లోని విద్యానగర్ వాటర్ ట్యాంక్ సమీపంలో పీరీలకు మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

వీణవంక/ సైదాపూర్, జూలై 15: మొహర్రం వేడుకలను సోమవారం జిల్లాలో ఘనంగా జరుపుకొన్నారు. ఇందులో భాగంగా ఆయా గ్రామాల్లో ముస్లింలు డప్పు చప్పుళ్ల మధ్య పీరీలను ఊరేగించగా, భక్తులు స్వాగతం పలికి, కోరిన కోర్కెలు తీరాలని పొర్లుదండాలు పెట్టి, పీరీలకు ముడుపులు కట్టి మొక్కులు చెల్లించుకున్నారు. సైదాపూర్ మండలం శివరాంపల్లి, వీణవంక మండలం కనపర్తి గ్రామాల్లో పీరీల పండుగతో సందడి నెలకొన్నది.

అర్ధరాత్రి అగ్నిప్రమాదం పండ్ల దుకాణాలు దగ్ధం

హుజూరాబాద్, జూలై 15: పట్టణంలోని పాపరావు బొంద ప్రాంతంలోని పండ్ల, ఇతర దుకాణాలు(బండ్లు) సోమవారం అర్ధరాత్రి అగ్నిప్రమాదంలో కాలి బూడిదయ్యాయి. అయితే ప్రమాదానికి షార్టుసర్క్యుటా...మరే ఇతర కారణమా..? తెలియాల్సి ఉంది. ఓవైపు వర్షం పడుతుంటే మరో వైపు అగ్ని ప్రమాదం జరుగడం పలు అనుమానాలకు తావిస్తున్నది. మొదటగా సూపర్‌బజారులోని రబ్బరు వస్తువులకు సంబంధించి దుకాణంలో మంటలు చెలరేగి ఇతర దుకాణాలకు వ్యాపించినట్లు తెలుస్తున్నది. అగ్నిమాపక యంత్రం సాయంతో మంటలను అదుపుచేశారు.

ప్రజావాణి ఫిర్యాదులపై నిర్లక్ష్యం వద్దు

- వెంటవెంటనే పరిష్కారమార్గాలు చూపాలి
- అదనపు కలెక్టర్ ప్రపుల్ దేశాయ్

అర్జీలు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ ప్రపుల్ దేశాయ్

కలెక్టరేట్, జూలై 15: వివిధ సమస్యలపై ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులపై అధికారులు నిర్లక్ష్యం వహిస్తే, కఠిన చర్యలు తప్పవని అదనపు కలెక్టర్ ప్రపుల్ దేశాయ్ హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణిలో పాల్గొన్న ఆయన జిల్లా నలుమూలల నుంచి వచ్చిన 307 మంది నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న వారి సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణికి వచ్చి అర్జీలు అందజేస్తారని, వీటిని ఆయా విభాగాల అధికారులకు వెంటనే పంపి పరిష్కార మార్గాలు చూపాలని సూచిస్తున్నట్లు పేర్కొన్నారు. అధికారులు వీటిని పరిశీలించి అర్జీదారులకు అండగా నిలువాలని సూచించారు. ప్రజావాణిలో నగర పాలక సంస్థ కార్యాలయానికి సంబంధించి 44, ఆర్డీవో ఆఫీసుకు 15, డీపీవోలో పెండింగ్ సమస్యలపై 14, డీఎంహెచ్‌వో కార్యాలయానికి 11 ఇతర ప్రభుత్వ శాఖల్లో పెండింగ్‌లో ఉన్న సమస్యలపై మిగతా దరఖాస్తులు వచ్చినట్లు వెల్లడించారు. కాగా, పలుమార్లు తాము ప్రజావాణికి వచ్చి ఫిర్యాదులు చేసినా చర్యలు శూన్యమంటూ పలువురు ఫిర్యాదుదారులు అదనపు కలెక్టర్‌కు విన్నవించారు. నగరంలోని అంబేద్కర్ స్టేడియంలో జరుగుతున్న పలు అవినీతి, అక్రమాలు, స్టేడియంలో నిబంధనలకు విరుద్ధంగా విధులు నిర్వహిస్తున్న ఒప్పంద ఉద్యోగుల నిర్వాకంపై ఇప్పటికే ఫిర్యాదు చేసినా, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటూ ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి శేఖర్ ఆధ్వర్యంలో పలువురు అదనపు కలెక్టర్‌కు ఫిర్యాదు అందజేశారు. సైదాపూర్ మండలం ఆకునూరు గ్రామ మాజీ సర్పంచ్ నిర్వాకంతో విలువైన తన భూమి కోల్పోవడంతో పాటు, గ్రామ ప్రజల దృష్టిలో చులకనయ్యామని, గ్రామానికి చెందిన కొల్ల వెంకటరెడ్డి అదనపు కలెక్టర్‌కు తన గోడు వెళ్లబోసుకున్నాడు. తన హయాంలో నిర్మించిన గ్రామపంచాయతీ భవనానికి దారి కోసం తనకు చెందిన మూడు గుంటల భూమి రూ.4లక్షల పైచిలుకు మొత్తానికి కొనుగోలు చేసి, అనంతరం డబ్బులివ్వడం లేదని ఫిర్యాదు చేశారు. దీనిని పరిష్కరించాలంటూ అదనపు కలెక్టర్.. డీపీవో రవీందర్‌కు అప్పగించారు. కార్యక్రమంలో డీఆర్‌వో పవన్‌కుమార్, ఆర్డీవోలు కుందారపు మహేశ్వర్, రమేశ్‌బాబు, కలెక్టరేట్ ఏవో గడ్డం సుధాకర్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కిరణ్‌ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

అల్ఫోర్స్‌లో బోనాల సంబురం

బోనాల సందర్భంగా పూజలు చేస్తున్న నరేందర్ రెడ్డి

కమాన్‌చౌరస్తా, జూలై 15 : తెలంగాణ రాష్ట్రానికి ప్రతీక అయిన బోనాల పండుగను కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఈ-టెక్నో పాఠశాలలో ఆషాఢమాసం సందర్భంగా అత్యంత భక్తి శ్రద్ధలతో వేడుకగా నిర్వహించారు. ఈ వేడుకలను అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వీ నరేందర్ రెడ్డి ప్రారంభించి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, మన రాష్ట్రంలో బోనానికి ప్రత్యేకమైన స్థానం ఉన్నదన్నారు. పోతరాజుల వేషధారణలో చిన్నారుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గృహజ్యోతి, గ్యాస్ పథకాల అమలు ఎప్పుడు?

నగరపాలక సంస్థ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

కార్పొరేషన్, జూలై 15 : కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు గడుస్తున్నా గృహజ్యోతి, 500 రూపాయలకే గ్యాస్ పథకాలు ఎందుకు అమలు చేయడం లేదంటూ సీపీఐ నగర సమితి ఆధ్వర్యంలో కరీంనగర్ నగర పాలక సంస్థ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు కసిరెడ్డి సురేందర్ రెడ్డి, పైడిపల్లి రాజు మాట్లాడుతూ, రోజుల తరబడి లైన్‌లో నిలుచుని దరఖాస్తు చేసుకున్న ప్రజలు ఆయా పథకాల కోసం ఎదురు చూస్తున్నారని తెలిపారు. నగరంలో పేద ప్రజలకు ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని చెప్పారని, కానీ ఆ ప్రక్రియ నేటికీ ప్రారంభం కాలేదని దుయ్యబట్టారు. ఈ ధర్నా కార్యక్రమంలో సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు కిన్నెర మల్లమ్మ, కటికిరెడ్డి బుచ్చన్న యాదవ్, నగర కార్యవర్గ సభ్యులు చంచల మురళి, ఓరుసు కొమరయ్య, నాయకులు బొంతల ఎల్లయ్య, ఏ బలరాం, సీహెచ్ సురేందర్, బింగి రవి, గోటికార్ భాగ్య, అహంకార్ ఉమా, బుజ్జి గుగులోతు రాజమ్మ, శ్యామ్, గొర్రె వెంకటి, బల్ల వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీని వాయిదా వేయాలి

కమాన్‌చౌరస్తా, జూలై 15 : డీఎస్సీని వాయిదా వేయాలని, లేకుంటే అసెంబ్లీని ముట్టడిస్తామని శాతవాహన యూనివర్సిటీ జేఏసీ వ్యవస్థాపక చైర్మన్, బీఆర్ఎస్ నాయకుడు చెన్నమల్ల చైతన్య తేల్చిచెప్పారు. శాతవాహన యూనివర్సిటీ పరిధిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొన్ని రోజులుగా ఉస్మానియా యూనివర్సిటీలోని ఆర్ట్స్ కళాశాల వద్ద డీఎస్సీ వాయిదా వేయాలంటూ పెద్ద ఎత్తున ధర్నా చేస్తున్న నిరుద్యోగులతో పాటు జర్నలిస్టులపైనా దాడి చేయడం సరికాదన్నారు. డీఎస్సీని రెండు నెలలు వాయిదా వేయాలని డిమాండ్ చేశారు. పెద్ద ఎత్తున ఉద్యమం జరుగుతున్నప్పటికీ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవహరిస్తున్నదని దుయ్యబట్టారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు శనిగరం అరుణ్ కుమార్, గడ్డమీది రాజశేఖర్, భూక్యా సాయి నాయక్, నేదునూరి హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

హోంగార్డ్ కుటుంబానికి ఆర్థిక సాయం

రాంనగర్, జూలై 15: కరీంనగర్ బస్టాండ్ కాంప్లెక్స్‌లో గల యూనియన్ బ్యాంక్ అగ్నిప్రమాదంలో గాయపడిన హోంగార్డు దేవయ్యకు అగ్నిమాపక శాఖ అధికారులు, బ్యాంకు సిబ్బంది ఆర్థిక సాయం అందజేశారు. హాస్పిటల్‌లో చికిత్స కోసం కరీంనగర్ డివిజన్ అగ్నిమాపక సిబ్బంది, రాష్ట్ర అగ్నిమాపక సిబ్బంది, యూనియన్ బ్యాంక్ సిబ్బంది అందరూ కలిసి దాదాపు రూ.90 వేలు జమ చేశారు. నగదు మొత్తాన్ని దేవయ్య కుటుంబానికి అగ్నిమాపక శాఖ డివిజనల్ సెక్షన్ అధికారులు సిబ్బంది కలిసి అందజేశారు.

యువతి అనుమానాస్పద మృతి

గంగాధర, జూలై 15: యువతి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన గంగాధర మండలంలో జరిగింది. ఇన్‌చార్జి ఎస్ఐ సురేందర్ తెలిపిన వివరాల మేరకు.. గర్శకుర్తి గ్రామానికి చెందిన చిందం మాధవి(23) కరీంనగర్‌లో పీజీ చదువుతున్నది. ఆదివారం రాత్రి ఇంట్లో ఉరేసుకున్నది. కాగా, ఆమె మృతిపై అనుమానాలు ఉన్నట్టు మృతురాలి మేనమామ సిరిమల రాజేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఇన్‌చార్జి ఎస్ఐ తెలిపారు.

అవినీతి అధికారిని ఏసీబీకి పట్టించిన వ్యక్తికి సన్మానం

కావేటి రాజుయాదవ్‌ను సన్మానిస్తున్న అఖిల భారత మహాసభ జిల్లా నాయకులు

తెలంగాణచౌక్, జూలై 15: లంచం కోసం వేధింపులకు గురిచేసిన డీసీఎంఎస్ మేనేజర్ వెంకటేశ్వర్ రావును ఏసీబీ అధికారులకు పట్టించిన కావేటి రాజు యాదవ్‌ను అఖిల భారత యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడు నాగారపు సత్యనారాయణయాదవ్ ఆధ్వర్యంలో సోమవారం సంఘ కార్యాలయంలో శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా సత్యనారాయణయాదవ్ మాట్లాడుతూ, అధికారులు ప్రజలకు సేవ చేయాలని, అవినీతి పాల్పడవద్దని హితవు పలికారు. అవినీతి అధికారిని పట్టుకున్న ఏసీబీ డీఎస్పీ దక్షిణామూర్తికి సంఘం తరఫున కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రమేశ్‌యాదవ్, నాయకులు మల్లేశం యాదవ్, అశోక్‌యాదవ్, సతీశ్‌యాదవ్ పాల్గొన్నారు.

పెద్ద చెరువుకు మరమ్మతులు చేయించండి

కొత్తపల్లి, జూలై 15 : బుంగపడ్డ కొత్తపల్లి పెద్ద చెరువుకు మరమ్మతులు వెంటనే చేపట్టాలని, లేదంటే వర్షాలకు చెరువు తెగిపోయి ప్రాణ, ఆస్తినష్టం సంభవించే ప్రమాదం ఉందని పట్టణవాసులు సోమవారం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. మత్తడికి వెంటనే మరమ్మతులు చేపట్టేలా నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించాలని కలెక్టర్‌ను కోరారు. అంతకు ముందుగా వారు కొత్తపల్లి బుంగపడ్డ చెరువును పరిశీలించారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో మాజీ జడ్పీ కో ఆప్షన్ సభ్యుడు ఎండీ జమీలుద్దీన్, కె.వెంకట్‌రెడ్డి, కొత్త రాజయ్య, నంగి బీరయ్య, పట్టణ వాసులు ఉన్నారు.

గుర్తుతెలియని మహిళ మృతి

రాంనగర్ జూలై 15: జిల్లా కేంద్రంలోని బస్టాండ్ ప్రాంగణంలో హైదరాబాద్ ప్లాట్‌ఫాం వద్ద గుర్తు తెలియని మహిళ స్పృహతప్పి పడిపోగా బస్టాండ్ సెక్యూరిటీ సిబ్బంది 108 అంబులెన్స్ ద్వారా ప్రభుత్వ దవాఖానకు తరలించారు. అప్పటికే ఆమె మృతి చెందిందని వైద్యులు తెలిపారు. మృతురాలికి సుమారు 55 నుంచి 60 సంవత్సరాల వయసు ఉంటుందని, అంబులెన్స్‌లో తరలించే సమయంలో తన పేరు కమలగా చెప్పినట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని మార్చురీలో భద్రపరిచామని, సంబంధించిన ఎవరైనా ఉంటే వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని ఇన్‌స్పెక్టర్ సరిలాల్ తెలిపారు.

హోం గార్డుకు వీడ్కోలు సన్మానం

రాంనగర్, జూలై 15: కరీంనగర్‌లోని హోంగార్డు విభాగంలో విధులు నిర్వహిస్తున్న మహేందర్ దాదాపు 30 సంవత్సరాలు పోలీస్ శాఖలో సేవలందించి సోమవారం ఉద్యోగ విరమణ పొందగా, కరీంనగర్ అడిషనల్ డీసీపీ లక్ష్మీనారాయణ పూలమాల వేసి, శాలువాతో సత్కరించి వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ హోం గార్డు మోడెం సురేశ్, హెడ్ కానిస్టేబుల్ లచ్చయ్య పాల్గొన్నారు.

ప్రమాదబీమా చెక్కు అందజేత

విద్యానగర్, జూలై 15 : గాయత్రి కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు కరీంనగర్ శాఖ ఖాతాదారుడు పంజాల రాజేశం ఇటీవల ప్రమాదవశాత్తు మృతిచెందగా, ఆయన కుమారుడు అజయ్‌కు సోమవారం బ్యాంకులో రూ. లక్ష బీమా చెక్కును బ్రాంచి మేనేజర్ అశోక్ అందించారు. కార్యక్రమంలో జూనియర్ ఆఫీసర్ విష్ణు ప్రసాద్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

తిమ్మాపూర్, జూలై 15: మండలంలోని రామకృష్ణ కాలనీ గ్రామంలో బేడ బుడగ జంగాల వీధికి చెందిన తిరుపతి ఇటీవల మరణించగా.. అతడి కుటుంబాన్ని గ్రామ రెడ్డి సంఘం అధ్యక్షుడు దావు సంపత్‌రెడ్డి సోమవారం పరామర్శించారు. అనంతరం ఆర్థిక సాయం అందజేశారు.

అంగన్‌వాడీ బాట అవగాహన ర్యాలీలు

నగరంలోని 4వ డివిజన్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది, చిన్నారుల తల్లులు

కార్పొరేషన్/ కలెక్టరేట్/ చొప్పదండి/ సైదాపూర్/ కరీంనగర్ రూరల్/తిమ్మాపూర్ రూరల్, జూలై 15 : ప్రీ స్కూళ్లుగా మారిన అంగన్‌వాడీ కేంద్రాల్లో బోధించే అంశాలపై సోమవారం జిల్లా వ్యాప్తంగా అమ్మమాట-అంగన్‌వాడీ బాట పేరిట అవగాహన ర్యాలీలు నిర్వహించారు. నగరంలోని రజ్వీ చమాన్, శ్రీనగర్ కాలనీ, కిసాన్‌నగర్, కోతిరాంపూర్, లక్ష్మీనగర్, హౌసింగ్‌బోర్డు, దుర్గమ్మగడ్డ, తదితర ప్రాంతాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో కొనసాగిన ఈ ర్యాలీల్లో ఆయా డివిజన్లలోని కార్పొరేటర్లు, కేంద్రాలకు వచ్చే బాలల తల్లులు, సామాజిక కార్యకర్తలు, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. కిసాన్ నగర్ సెక్టార్‌లో నిర్వహించిన అవగాహన ర్యాలీలో కార్పొరేటర్ కంసాల శ్రీనివాస్, అర్బన్ సీడీపీవో జి.ఉమారాణి, అంగన్‌వాడీ టీచర్లు పద్మజ, జి.సుజాత, వి.సంధ్యారాణి, జి.అరుణాదేవి, ఎఎన్ఎం మానస, ఆశ వర్కర్లు జానకి, కవిత, ఆర్పీ రజిత, చిన్నారుల తల్లులు, సెక్టార్ సూపర్‌వైజర్ రాజేశ్వరి, కోతిరాంపూర్ సెక్టార్‌లోని పోచమ్మవాడ అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో నిర్వహించిన కార్యక్రమంలో కార్పొరేటర్ జంగిలి ఐలేందర్ యాదవ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్, అంగన్‌వాడీ టీచర్ స్వరూప, 4వ డివిజన్ పరిధిలో నిర్వహించిన కార్యక్రమంలో కార్పొరేటర్ నుజాహత్ అలీ, అంగన్‌వాడీ టీచర్ కె.సరళాదేవి, ఆర్‌పి. ఎల్.సుజాత, ఆశ కార్యకర్త జి.పద్మజ, పిల్లల తల్లులు, 22వ డివిజన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కార్పొరేటర్ గంట కల్యాణిశ్రీనివాస్, అధికారులు రాజమణి, పద్మ, తల్లిదండ్రులు, పిల్లలు పాల్గొన్నారు.

చొప్పదండి పట్టణంలోని అంగన్‌వాడీ కేంద్రం ఆధ్వర్యంలో అమ్మమాట-అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా ర్యాలీ తీశారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ బాలుర పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజిరెడ్డి, పీఈటీ కృష్ణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి, రేణుక, వార్డు అధికారులు సాయి కృష్ణ, సాగర్, అంగన్‌వాడీ టీచర్లు మల్లీశ్వరి, రజిత, లలిత, భాగ్యలక్ష్మి, సుజాత, స్వరూప, రాజసులోచన తదితరులు పాల్గొన్నారు.

సైదాపూర్ మండలకేంద్రంలోని వెన్కేపల్లి-సైదాపూర్ గ్రామాల్లో నిర్వహించిన అంగన్‌వాడీ బాట ర్యాలీలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు స్వరూప, జ్యోతి మాట్లాడుతూ, రెండున్నర సంవత్సరాల నుంచి ఐదు సంవత్సరాల్లోపు పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ సమ్మయ్య, అంగన్‌వాడీ టీచర్లు మంజుల, సులోచన, భానుమతి, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

కరీంనగర్ మండలంలోని ఆయా గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో చేపట్టిన అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా కేంద్రాల్లో అందిస్తున్న సేవలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో చెర్ల భూత్కూర్‌లో గ్రామ పంచాయతీ కార్యదర్శి అబ్దుల్ వాహెద్, ప్రాథమికోన్నత పాఠశాల హెచ్ఎం భారతీ, దుర్మేడ్ గ్రామంలో ప్రాథమిక పాఠశాల హెచ్ఎం జానకీ దేవి, పంచాయతీ కార్యదర్శి సంజీవరెడ్డి, సీఏటీ విజయలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు బీ పద్మక్షి, రాజేశ్వరి, ఆశవర్కర్లు లక్ష్మి, సరోజన, జూబ్లీనగర్‌లో పంచాయతీ కార్యదర్శి ఎం కిరణ్‌కుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నిర్మల, హెచ్ఎం జలజారాణి, ఏఎన్ఎం సుగుణ, అంగన్‌వాడీ టీచరు స్వరూపారాణి తదితరులు పాల్గొన్నారు.

తిమ్మాపూర్ మండలంలోని పోలంపల్లి అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పించాలని తల్లిదండ్రులకు మొక్క ఇచ్చి ఆహ్వానించారు. ఏసీడీపీవో అరవింద, సూపర్‌వైజర్ పద్మ, జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయుడు వీ శ్రీనివాస్, పీఎస్ హెచ్ఎం రవీందర్ రెడ్డి, డాక్టర్ కిరణ్ కుమార్, పంచాయతీ కార్యదర్శి వెంకట్ రెడ్డి, వీవోసీఏలు, ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

'ప్రజా సమస్యలపై ఉద్యమాలకు సిద్ధమవ్వండి'

రామడుగు, జూలై 15 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పాలనకు వ్యతిరేకంగా ప్రజా సమస్యల పరిష్కారం, ఎన్నికల హామీల అమలు కోసం ఉద్యమాలకు సిద్ధం కావాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి పార్టీ కార్యకర్తలు, నాయకులకు పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సీపీఐ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక పాలనకు చరమగీతం పాడుతూ గ్రామాల్లో ప్రజలను చైతన్యపరిచి ఉద్యమాలకు ఊపిరి పోయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు కొయ్యడ సృజన్‌కుమార్, ట